

ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, వ్యవసాయశాఖ సలహామండలి జిల్లా చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, బైరెడ్డి అరుణ, ఎన్‌జీ పాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి



వేదిక ముందు తీర్చిదిద్దిన కళారూపం, భారీగా తరలివచ్చిన ప్రజానీకం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం, ప్రజాప్రతినిధులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఒంగోలు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, కార్పొరేటర్లు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, నాగరాజు, వెన్నపూస కుమారి, శోభారాణి, మస్తానమ్మ, అంబటి ప్రసాద్, ఇమ్రాన్, జడా వెంకటేష్, గురవయ్య, శైలజ, చింతపల్లి గోపి, తాడి కృష్ణలత, స్వాతి, ఫాతిమా, కో ఆప్షన్ మెంబర్ రషీద, ధనలక్ష్మి, కారంశెట్టి పుష్పలత, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ తిరుపతిరావు, పెద్దిరెడ్డి నియంతకుమారి, కె.కమల, డాకా సుజాత

పట్టాల పండగ

ఒంగోలు ప్రజలకు ఇళ్ల స్థల పట్టాల పంపిణీ పండుగలా జరిగింది. నగరంలోని అగ్రహారం వద్ద శుక్రవారం అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో పేదలకు పట్టాల పంపిణీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అర్హులైన 20,840 మందికి రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థల పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఒంగోలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో చేరుకున్న ప్రజలు, లబ్ధిదారులతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీఎం సుదీర్ఘ ప్రసంగం ఆద్యంతం ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు జేజేలు పలికారు. జై జగనన్న, జై బాలినేని నినాదాలు మార్మోగాయి.

- ఒంగోలు రూరల్





సభా ప్రాంగణంలో ప్లకార్డులతో చిన్నారుల ఆనందోత్సాహాలు



సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న విద్యార్థులు



సభకు భారీగా తరలివస్తున్న మహిళలు



ఫొటోలు తీస్తున్న యువతులు

సంక్షిప్తంగా

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చీమకుర్తి: ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశం కోసం ప్రభుత్వం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చీమకుర్తి ఎంఈఓ–2 కే.శివాజీ తెలిపారు. దరఖాస్తు చేసుకునే విధానాన్ని శుక్రవారం చీమకుర్తిలో ఆయన వివరించారు. 5 సంవత్సరాలు నిండి 2024–25 విద్యాసంవత్సరంలో 1వ తరగతిలో చేరేందుకు చీమకుర్తి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలకు 1 కి.మీ దూరంలో ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లోని 25 శాతం సీట్లను విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచితంగా పేదపిల్లలకు కేటాయించాలనే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఎలాంటి ఆదాయ పరిమితి లేదన్నారు. బీసీ, ఓసీ కుటుంబాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షల్లోపు ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆదాయ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో సమీపంలోని సచివాలయాల్లోగానీ, మండల విద్యావనరుల కేంద్రం ద్వారా విద్యాశాఖ వెబ్‌సైట్‌లోగానీ మార్చి 14వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని ఎంఈఓ తెలిపారు. ఈ అవకాశాన్ని చీమకుర్తి మండలంలోని పేద పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి వాల్మీకి సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞం

ఒంగోలు మెట్రో: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని పవిత్ర మాఘమాసం సందర్భంగా వాల్మీకి రచించిన సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞం కార్యక్రమాన్ని ఒంగోలు మండలంలోని వలేటివారిపాలెంలో గల శ్రీకోదండ రామస్వామి దేవస్థానం (రామక్షేత్రం)లో ప్రసన్నాంజనేయస్వామి దివ్య ఆశీస్సులతో పది రోజులపాటు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం అర్చకుడు నారాయణం కళ్యాణ చక్రవర్తి, భక్త బృందం తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు, స్వర్ణకంకణ గ్రహీత పొన్నూరు వేంకట శ్రీనివాసులుచే సంపూర్ణ రామాయణ ప్రవచన మహా యజ్ఞాన్ని ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి 7 నుంచి తొమ్మిది గంటల వరకు ఉపన్యాస యజ్ఞం ఉంటుందన్నారు. 4వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుంచి నవమి సందర్భంగా కోదండ రామస్వామి కళ్యాణ మహోత్సవం, శ్రీరామ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాల్మీకి సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞాన్ని విజయవంతం చేసి కోదండ రామస్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

అన్నదాతలపై కాల్పులు జరిపించడం క్రూరత్వం

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఆందోళన చేపట్టిన అన్నదాతలను తుపాకులతో కాల్చిచంపడం క్రూరత్వానికి నిదర్శనమని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన ప్రదర్శన చేస్తున్న అన్నదాతలపై హర్యానా పోలీసులు జరిపిన కాల్పులలో శుభకరణ్ సింగ్ అనే యువరైతు మరణించడం, అనేక మంది రైతులు తీవ్రంగా గాయపడటంపై సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. చుంచు శేషయ్య, పి.వెంకటరావు, వీరారెడ్డి అధ్యక్షత వహించగా, చుండూరి మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, సీ2ప్లస్ 50 శాతం కలిపి ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులను అటకెక్కించిన మోదీ ప్రభుత్వం మరోవైపు ఆయనకు అత్యున్నత పురస్కారాలు ప్రకటించడం మోసపూరిత చర్యగా అభివర్ణించారు. రైతులపై కాల్పులు జరిపిన పోలీసులను ఉద్యోగం నుంచి తొలగించాలని, వారి మీద హత్య కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రైతులకు రాత పూర్వకంగా ఇచ్చిన హామీని ఉల్లంఘించిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన ప్రదర్శనలో రైతు నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, బి.పద్మ, బాలకోటయ్య, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, జీవీ వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, ఎస్.లలితకుమారి, మాబు, పెండ్యాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ అర్బన్ కమిటీ ఎన్నిక

ఒంగోలు టౌన్: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఒంగోలు అర్బన్ నూతన కమిటీని స్థానిక ఎల్బీజీ భవన్‌లో జరుగుతున్న అర్బన్ ప్రాజెక్టు మహాసభలలో శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా ఏ పద్మ, ప్రధాన కార్యదర్శిగా కె.ఎమీమా, సహాయ కార్యదర్శులుగా ప్రశాంత్ కుమారి, సంధ్యారాణి, నిర్మలాదేవి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ జ్యోతి, కే శోభారాణి, రాజేశ్వరి, డి.సాయిప్రియతో పాటు 11 మంది ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా టి.మహేష్ వ్యవహరించనున్నారు.

పొదుపు ఖాతాల ప్రయోజనాలను వివరించండి

చీమకుర్తి: పోస్టాఫీస్‌లో పొదుపు ఖాతాల ప్రయోజనాల గురించి ఖాతాదారులకు వివరించాలని పోస్టల్ శాఖ ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ మల్లాది హరిప్రసాద్‌శర్మ తెలిపారు. ఇంటింట పొదుపు పంట–3.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చీమకుర్తిలోని సబ్‌పోస్టాఫీస్ సిబ్బందికి పోస్టాఫీస్‌లోని పథకాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వాటిని ఖాతాదారులకు వివరించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒంగోలు వెస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, చీమకుర్తి పోస్ట్‌మాస్టర్ కాలే రామారావు, వాసుబాబు, సతీష్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం.. అందరికీ ఆరోగ్యం

ఒంగోలు రూరల్: అందరికీ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. మండలంలోని యరజర్ల గ్రామంలో సర్పంచ్ టి.రాములమ్మ శ్రీనివాస్ అధ్యక్షతన కార్యదర్శి రామకృష్ణ కన్వీనర్‌గా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వాణి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి వద్దే వైద్యం చేయించుకునే అవకాశం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏర్పడిందన్నారు. పేదలందరికీ ఉచిత వైద్యం పొందే సౌకర్యం కలిగిందన్నారు. మార్చి 3వ తేదీ జాతీయ పోలియో దినోత్సవం సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజం ప్రభుత్వ లక్ష్యమని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కరవది పీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక ఏఎన్‌ఎం, 104 సిబ్బంది పాల్గొనగా, 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి ఈసీజీ, రక్త పరీక్షలు, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు.